# వాస్తవం
డెయిలీ.కామ్
ఉన్నది ఉన్నట్లుగా
డిజిటల్ పత్రిక
మంగళవారం 27.10.2026
ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి


## నేడు న్యూజిలాండ్‌తో భారత్ మూడో టీ20

### సిరీస్‌పై గురి పెట్టిన అయ్యర్ సేన..మధ్యాహ్నం 12.30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో



**వెల్లింగ్టన్ :** న్యూజిలాండ్ టూర్‌లో వరుసగా రెండు అద్భుత విజయాలతో ఖతర్నాక్ ఫామ్‌లో ఉన్న టీమిండియా సిరీస్‌పై గురి పెట్టింది. మంగళవారం జరిగే మూడో పోరులోనూ గెలిచి సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే కైవసం చేసు కునేందుకు సిద్ధమైంది. 2020లో విరాట్ కోహ్లీ సారథ్యంలో న్యూజిలాండ్‌ను వారి సొంత గడ్డపై 5-0తో క్లీన్‌స్వీప్ చేసిన టీమిండియా ఆ తర్వాత 2022-23 పర్యటన లోనూ అజేయంగా నిలిచింది. ఇప్పుడు పేస్ లీడర్ జస్‌ప్రీత్ బుమ్రా, స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా లేకపోయినా తొలి రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని జట్టు అదే రికార్డును కొనసాగించాలని చూస్తోంది. అయితే, వెల్లింగ్టన్‌లోని బేసిన్ రిజర్వ్ మైదానంలో వీచే తీవ్రమైన ఈదురు గాలులు, చల్లటి వాతావరణం భారత క్రికెటర్లకు ప్రధాన పరీక్షగా మారనున్నాయి.

# తుమ్మిడిహెట్టిపై పున:పరిశీలన

తెలంగాణ, మహారాష్ట్రల పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రెండు రాష్ట్రాల సరిహద్దులో ప్రాణహిత నదిపై 152 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మాణానికి సహకరించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చేసిన విజ్ఞప్తిపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. తుమ్మిడిహెట్టి బరాజ్ ఎత్తును పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను మరోసారి పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అయితే తుది నిర్ణయానికి వచ్చే ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలను పరిశీలించాలని స్పష్టం చేశారు.

- ఎత్తు పెంపునకు సీఎం రేవంత్ విజ్ఞప్తిపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి సానుకూల స్పందన
- 152 మీటర్ల ఎత్తుతో బరాజ్ నిర్మాణానికి అంగీకరించాలన్న రేవంత్‌రెడ్డి
- తెలంగాణ నీటి అవసరాలకు సహకరించడానికి ఎలాంటి అభ్యంతరం లేదన్న ఫడ్నవీస్
- మహారాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకే ప్రాధాన్యం
- తుది నిర్ణయానికి వచ్చే ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాల్సి ఉందని వ్యాఖ్య
- వాస్తవాలు, సాంకేతిక అంశాల ఆధారంగా తదుపరి నిర్ణయం తీసుకుంటామని వెల్లడి
- రెండు రాష్ట్రాల నీటిపారుదల అధికారులతో కమిటీ ఏర్పాటుకు ప్రతిపాదన
- ముంబైలో ఫడ్నవీస్‌తో సీఎం నేతృత్వంలోని తెలంగాణ బృందం భేటీ
- గిరిజనులు, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందన్న రేవంత్
- మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు పరిహారం చెల్లించేందుకు సిద్ధం
- ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సుకు ఫడ్నవీస్‌కు ఆహ్వానం



**హైదరాబాద్:** తెలంగాణ, మహారాష్ట్రల పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రెండు రాష్ట్రాల సరిహద్దులో ప్రాణహిత నదిపై 152 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మాణానికి సహకరించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చేసిన విజ్ఞప్తిపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. తుమ్మిడిహెట్టి బరాజ్ ఎత్తును పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను మరోసారి పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అయితే తుది నిర్ణయానికి వచ్చే ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలను పరిశీలించాలని స్పష్టం చేశారు. మహారాష్ట్రపై, తమ ప్రజలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే, 148 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మాణానికి గతంలో రెండు రాష్ట్రాల మధ్య జరిగిన ఒప్పందాన్ని పున: పరిశీలించడానికి అభ్యంతరం లేదని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం సోమవారం ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఫడ్నవీస్‌తో సమావేశమై తుమ్మిడిహెట్టి బరాజ్‌పై చర్చలు జరిపింది. తొలుత బరాజ్ ప్రాధాన్యతపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి, గిరిజనుల జీవన పరిస్థితులు, ఆర్థిక వెనుకబాటుతనాన్ని వివరించారు. బరాజ్ ఎత్తు పెంపు ప్రతిపాదనలు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, ఇతర సాంకేతిక అంశాలపై (మిగతా 9లో..)

## కరువు తెచ్చి... వరి వద్దంటరా?

- గోదావరిలో నీళ్లున్నా ఎత్తిపోయరు
- కృష్ణకు వదిలి కరువు అంటున్నరు
- రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది
- ఈ ప్రభుత్వం ఏ వర్గానికీ న్యాయం చేయలే
- ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పోరాటానికి మద్దతు
- ఏడాది ఓపిక పడితే.. మళ్లీ వచ్చేది కేసీఆరే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




గోదావరిలో నీళ్లున్నా ఎత్తిపోయకుండా రాష్ట్రంపైకి కరువును తెచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు వరి వేయవద్దంటూ రైతులకు సుద్దులు చెప్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ఇవాళ రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏ ఒక్క వర్గానికీ న్యాయం చేయలేదని, అన్ని వర్గాలనూ మోసం చేసిండని దుయ్యబట్టారు.ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి అండగా ఉంటామని, కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం అసెంబ్లీలో నిలదీస్తామని భరోసా ఇచ్చారు. సిరిసిల్ల జిల్లాలో కేటీఆర్ సోమవారం పర్యటించారు. మొదట గంభీరావుపేట మండలం లింగన్నపేటలో శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు.

## అది తప్పుడు వార్తే

- అంగీకరించిన ఈనాడు పత్రిక
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు క్షమాపణ
- కేటీఆర్ పంపిన లీగల్ నోటీసులకు తలవంచిన ఈనాడు యాజమాన్యం
- కేటీఆర్ పాస్‌పోర్టుపై తప్పుడు వార్త ప్రచురించామని పశ్చాత్తాపం
- సంబంధిత కథనాలను అన్ని వేదికల నుంచి తొలగించినట్టు స్పష్టీకరణ
- కేటీఆర్ న్యాయవాది పంపించిన నోటీసుకు సంస్థ సమాధానం
- వ్యవహారాన్ని ముగించాలని విన్నపం

09



## రాష్ట్ర హైకోర్టుకు కొత్త చీఫ్ జస్టిస్

### కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తపబ్రత చక్రవర్తి

### పేరును సిఫారసు చేసిన కొలీజియం

### నలుగురు న్యాయమూర్తులకు సీజేలుగా పదోన్నతి



**హైదరాబాద్, అక్టోబరు 26 :** రాష్ట్ర హైకోర్టుకు కొత్త ప్రధాన న్యాయమూర్తి రానున్నారు. కలకత్తా హైకోర్టు జడ్జి జస్టిస్ తపబ్రత చక్రవర్తిని తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ (సీజే)గా నియమించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. సోమవారం జరిగిన కొలీజియం సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (యాక్టింగ్ సీజే)గా వ్యవహరిస్తున్న జస్టిస్ శాంకోషీని ఢిల్లీ హైకోర్టు సీజేగా నియమించాలని కొలీజియం సిఫారసు చేసింది. గుజరాత్ హైకోర్టులో న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ మానస్ రంజన్ పాఠక్‌ను అదే హైకోర్టు సీజేగా, పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధీర్‌సింగ్‌ను ఉత్తారఖండ్ హైకోర్టు సీజేగా నియమించాలని తీర్మానించింది.మొత్తంగా నలుగురు హైకోర్టు న్యాయమూర్తులకు సీజేలుగా పదోన్నతి కల్పిస్తూ కొలీజియం సిఫారసులు చేసింది. వీటికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన అనంతరం వీరు పదవీబాధ్యతలు చేపట్టనున్నారు. కాగా, తెలంగాణ హైకోర్టు సీజేగా ఉన్న జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్ ఈ నెల మొదట్లో పదోన్నతిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా వెళ్లారు. దీంతో హైకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తి అయిన జస్టిస్ శాంకోషి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. కొలీజియం తాజా సిఫారసుతో త్వరలో పూర్తిస్థాయి సీజే రానున్నారు.

### ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాల్లో

## 100శాతం ఇథనాల్!

**న్యూఢిల్లీ :** పెట్రోల్ అవసరం లేకుండా పూర్తిగా ఇథ నాల్‌తో నడిచే కార్లు రోడ్లపై పరుగులు పెట్టనున్నాయి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాల్లో ఈ100 ఇంధనం (100 శాతం ఇథనాల్) వాడేందుకు అనుమతిస్తూ కేంద్ర రవాణా శాఖ సోమవారం మోటారు వాహన నిబంధనల్లో మార్పులు చేసింది. దీంతో అధిక ఇథనాల్ మిశ్రమాలతో నడిచే కార్ల తయారీ, ధ్రువీకరణకు చట్టపరంగా మార్గం సుగమం అయినట్లయింది. ముడి చమురు దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించడం, ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించడానికే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, ఈ100 ఇంధనానికి అనుమతి లభించినంత మాత్రాన ప్రస్తుతం రోడ్లపై తిరుగుతున్న అన్ని పెట్రోల్ కార్లలో ఈ ఇంధనాన్ని వాడేందుకు వీలుండదు. తయారీ సంస్థలు ప్రత్యేకంగా రూపొందించి, నిర్దేశిత ప్రమాణాల ప్రకారం ధ్రువీకరించిన ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాల్లోనే ఈ100 లేదా ఈ85 ఇంధనాన్ని వినియోగించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ20 పెట్రోల్‌కు అనుగుణంగా ఉన్న కార్లలో, సాధారణ పెట్రోల్ వాహనాల్లో నేరుగా ఈ100 ఇంధనాన్ని నింపడానికి అనుమతి లేదు. అధిక ఇథనాల్ శాతాన్ని తట్టుకునేలా ఇంజన్, ఇంధన సరఫరా వ్యవస్థలను ప్రత్యేకంగా రూపొందించాల్సి ఉంటుంది. ప్రస్తుతం దేశంలో ఉన్న ఈ20 పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్, 80శాతం పెట్రోల్ ఉంటాయి. తాజాగా నిబంధనల్లో చేసిన మార్పులతో ఈ85తోపాటు ఈ100 ఇంధనాన్నీ అధికారికంగా చేర్చారు.

# రాజస్థాన్‌లో ఏటీఎం చోరీ నిందితుడి అరెస్ట్

**గాంధారి ఏటీఎం చోరీ కేసును ఛేదించిన కామారెడ్డి పోలీసులు**
**రూ.25.45 లక్షల నగదు చోరీ.. ఐదు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు**

**వాస్తవం : కామారెడ్డి**



గాంధారి మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో జరిగిన భారీ చోరీ కేసును కామారెడ్డి పోలీసులు ఛేదించారు. అంతర్రాష్ట్ర స్థాయిలో ఐదు రాష్ట్రాల్లో గాలింపు చర్యలు చేపట్టి, రాజస్థాన్‌కు చెందిన రషీద్ (30) అనే నిందితుడిని అరెస్టు చేశారు. ఈ కేసులో మరికొందరు నిందితులు పరారీలో ఉండగా, వారి కోసం గాలింపు కొనసాగుతోంది.పోలీసుల వివరాల ప్రకారం.. అక్టోబర్ 10, 11 తేదీల మధ్య రాత్రి గాంధారి ప్రధాన రహదారి పక్కన ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంను గుర్తుతెలియని వ్యక్తులు గ్యాస్ కట్టర్‌తో ధ్వంసం చేసి, నగదుతో ఉన్న ఐదు బాక్సులను అపహరించారు. ఈ ఘటనలో రూ. 25, 45,900 నగదు చోరీకి గురైంది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాలతో, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు.

**నకిలీ నంబర్ ప్లేట్లతో చోరీలు....**

సీసీటీవీ దృశ్యాలు, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితులు ఉపయోగించిన నల్లరంగు మహీంద్రా స్కార్పియో వాహనాన్ని పోలీసులు గుర్తించారు. నిందితులు అసలు రిజిస్ట్రేషన్ నంబర్‌కు బదులుగా ఇతర వాహనాల నంబర్ ప్లేట్లను మార్చుతూ పోలీసుల కళ్లుగప్పినట్లు దర్యాప్తులో వెల్లడైంది. గతంలో కరీంనగర్ ప్రాంతం లోని రెండు ఎస్‌బీఐ ఏటీఎంల వద్ద కూడా గ్యాస్ కట్టర్‌తో చోరీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.చోరీ అనంతరం నిందితులు మహారాష్ట్ర మీదుగా రాజస్థాన్ వైపు పారిపోయినట్లు గుర్తించిన కామారెడ్డి పోలీసులు, అక్కడి పోలీసుల సహకారంతో గాలింపు చేపట్టారు. అక్టోబర్ 20న రాజస్థాన్‌లోని బరోదామేవ్ సమీపంలో బస్సు కోసం వేచి ఉన్న రషీద్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ట్రాన్సిట్ వారెంట్‌పై కామారెడ్డికి తీసుకొచ్చారు.అక్టోబర్ 21న రాజస్థాన్‌లోని చేచాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న నల్లరంగు స్కార్పియో వాహనాన్ని గుర్తించి, అందులోని గ్యాస్ కట్టింగ్ పరికరాలు, ఇతర పనిముట్లు, నకిలీ నంబర్ ప్లేట్లు, మొబైల్ ఫోన్లు, కత్తులు, ఇనుప రాడ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి నుంచి రూ. 29,400 నగదును కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అరెస్టయిన నిందితుడు రషీద్‌ను అక్టోబర్ 26న న్యాయ స్థానంలో హాజరుపరచనున్నట్లు ఎస్పీ రాజేష్ చంద్ర వెల్లడించారు. పరారీలో ఉన్న మిగతా నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు.ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస రావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్, ఎస్సైలు ఆంజనేయులు, పుష్పరాజ్‌తో పాటు పోలీసు సిబ్బందిని ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర అభినందించారు.

# మండల వార్డు మెంబర్ల ఫోరం ఎన్నిక



**వాస్తవం : మాదుగులపల్లి:** మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర వార్డు మెంబర్ల కోఆర్డినేటర్ నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మండల వార్డు మెంబర్ల ఫోరం ఎలిజాల రమేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వార్డ్ మెంబర్లకు ఐదు ప్రత్యేకమైన డిమాండ్లను ఇవ్వాలని వారి కోరారు వార్డు సభ్యులకు నెలకు 3000 రూపాయల గౌరవ వేతనం కల్పించాలి, వార్డుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి, ప్రతి వార్డు సభ్యునికి ప్రత్యేక హెల్త్‌కార్డు సౌకర్యం కల్పించాలి, వార్డు సభ్యుడు మరణించిన సందర్భంలో ఆయన కుటుంబం వారికి ఐదు లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా అందించాలి, గ్రామాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి శిలాఫలకాలపై వార్డు మెంబర్ పేర్లను నమోదు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యక్షులుగా తవిటి లక్ష్మణ్ ముదిరాజ్, నాగరాజు, శ్రీను, రవీందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డేబోయిన శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి,ఆవుల వెంకన్న, పగిళ్ల వెంకన్న, సహాయ కార్యదర్శులు నాగరాజు, శేఖర్, పూసపాటి జలంధర్, మండల ఫోరం మహిళా అధ్యక్షురాలు వనపట్ల సుశీల, వర్కింగ్ ప్రెసిడెంట్ చెరుకుపల్లి శివరాణిరాజు, ప్రధాన కార్యదర్శులు మర్రి కలమ్మ, చల్ల మాధవి, ఉపాధ్యక్షులు యశోద, కవిత పాల్గొన్నారు.

# గత పాలకులు నిర్లక్ష్యం రైతుకు శాపమైంది

**రాంటెక్‌లో రెవిన్యూ గ్రామ సభలో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్**

**వాస్తవం : నిర్మల్**



అప్పట్లో రెవెన్యూ అధికారుల తప్పిదాలు నియోజకవర్గంలో వేలాది మంది రైతులకు శాపమైందని, వారి నిర్లక్ష్యం మూలంగా రైతులు కోట్లాది రూపాయలు నష్టపోయారని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ముధోల్ మండలంలోని రామ్ టెక్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో ఆయన మాట్లాడారు.పంజాబ్ కంపెనీకి ఒక గ్రామంలో రైతు రెండు ఎకరాలు అమ్మితే ఆ సర్వే నంబర్ లో ఉన్న భూములు అన్ని రెవెన్యూ అధికారులు నిషేధిత జాబితాలో చేర్చి రైతుకు తీరని అన్యాయం చేశారన్నారు. తానూరు, ముధోల్ మండలాల్లో వందలాది మంది రైతులు 15 సంవత్సరాలుగా వారికి స్వంతగా భూమి ఉన్నప్పటికీ రైతుబంధు, రైతు బీమా , బ్యాంకు రుణం, ఇతర పథకాలకు నోచుకోలేక వ్యవసాయం చేసే రైతు కంటతడి పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అప్పట్లో బి ఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఇక్కడి పాలకులు పట్టించుకోకపోవడంతో భూమిని నమ్ముకున్న రైతుకు అన్యాయం జరిగిందన్నారు. రాంటెక్ గ్రామంలో రైతులు పంజాబ్ కంపెనీకి 37 ఎకరాల 20 గుంటల భూమి అమ్మితే 295 ఎక రాలు నిషేధిత జాబితాలో చేర్చడం జరిగిందన్నారు.అదేవిధంగా వెంకటాపూర్ గ్రామంలో 35 ఎకరాల భూమి అమ్మితే 152 ఎకరా ల భూమిని నిషేధిత జాబితాలో చేర్చి 152 మంది రైతులకు ఇబ్బంది పెట్టడం జరిగిందన్నారు. ఈ లెక్కన రైతుబంధు రైతులకు అందక రెండు గ్రామాలకు కలిపి రైతులు 3 కోట్ల 60 లక్షల రూపాయలు నష్టపోవడం జరిగిందన్నారు. ఇలా తానూర్ మండలంలో వేలాది ఎకరాల్లో ఇదే పరిస్థితి ఉందని రైతులు 100 కోట్ల వరకు నష్టపోవడం జరిగిందని, అప్పటి పాలకులు, కొందరు దుష్టశక్తుల మూలంగా ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. ఇకనైనా మేమున్నామం టూ మాయ మాటలు చెప్పే వారిని దగ్గరకు రానీయ వద్దన్నారు. తాను రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో మాట్లాడడంతో ప్రభుత్వం బాధిత గ్రామాల్లో గ్రామ రెవెన్యూ సభల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి సమస్యలను పరిష్కరిస్తుందన్నారు.రైతుకు అన్యాయం జరిగితే ఊరుకునే ప్రసక్తే లేదని, నిషేధిత జాబితా నుంచి రైతుల భూములను తొలగిస్తామన్నారు. అంతకుముందు రామ్ టెక్ సర్పంచ్ గంగాధర్, సీనియర్ నాయకులు నర్సా గౌడ్‌తో పాటు పలువురు మాట్లాడుతూ సమస్యను తాము ఎమ్మెల్యే పటేల్ దృష్టికి తీసుకుపోవడంతో,ప్రత్యేక దృష్టి సారించినందుకు కృతజ్ఞ తలు చెప్పారు. గ్రామ సభల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌తో పాటు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

**డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు**

# ప్రత్యేక తనిఖీలు



**వాస్తవం : ఎల్లారెడ్డిపేట:**

ఎల్లారెడ్డిపేట మండల పరిధిలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు పోలీసులు సోమవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కిరాణా, పాన్ షాపులు, పాఠశాల పరిసర ప్రాంతాలు, బస్టాండ్ ప్రాంతాల్లో నార్కోటిక్ జాగిలం సహాయంతో తనిఖీలు చేపట్టారు.అనుమానాస్పద వ్యక్తులు, బ్యాగులు, వస్తువులను క్షుణ్ణంగా పరిశీలించారు.మత్తు పదార్థాల విక్రయాలు, రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. ప్రజల సహకారంతోనే మత్తు పదార్థాల నిర్మూలన మరింత సమర్థవంతంగా సాధ్యమవుతుందని ఎస్సై తెలిపారు.

# దుమాలలో మూడు ఇళ్లలో చోరీ

**వాస్తవం : ఎల్లారెడ్డిపేట :**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామంలో దొంగలు బీభత్సం సృష్టించారు. తాళాలు వేసి ఉన్న మూడు ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడ్డారు. ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని అదునుగా తీసుకుని తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడినట్లు ఇంటి యజమానులు తెలిపారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మూడు ఇళ్లలో ఎంతమేర ఆస్తి నష్టం జరిగింది, ఏయే వస్తువులు చోరీకి గురయ్యాయనే వివరాలు తెలియాల్సి ఉంది. వరుస చోరీలతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.గ్రామంలో ఆదివారం రోజున రాత్రి సమయంలో తాళాలు పగులగొట్టి దొంగతనాలు జరిగాయి ఎల్లారెడ్డిపేట పోలీసులు తనిఖీ చేపట్టారు.రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామంలో దొంగలు బీభత్సం సృష్టించారు. తాళాలు వేసి ఉన్న మూడు ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడ్డారు. ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని అదునుగా తీసుకుని తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడినట్లు ఇంటి యజమానులు తెలిపారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మూడు ఇళ్లలో ఎంత మేర ఆస్తి నష్టం జరిగింది, ఏయే వస్తువులు చోరీకి గురయ్యాయనే వివరాలు తెలియాల్సి ఉంది. వరుస చోరీలతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.





# ఎల్ నినోని ఎదుర్కొందాం

- సంక్షోభాన్ని పసిగట్టి సన్నద్ధమవుదాం
- మద్దతు ధర కంటే తక్కువకు రైతులు ధాన్యం అమ్ముకోవద్దు
- నియోజకవర్గంలో అక్టోబర్ 26 నుండి 136 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**వాస్తవం : హుస్నాబాద్ :**

ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రజలంతా సన్నద్ధం కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో వరి ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను మంత్రి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, రైతులు పండించిన ధాన్యం, పత్తిని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో అక్టోబర్ 26 నుంచి 136 కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. కొనుగోళ్ల సమయంలో తూకంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఎంత ధాన్యం, పత్తి వచ్చినా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు నేరుగా కల్లాల వద్దకు వస్తున్నారని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ మద్దతు ధర కంటే ఎక్కువ ధర లభిస్తే రైతులు విక్రయించుకోవచ్చని, దళారుల చేతిలో మోసపోవద్దని కోరారు.సన్న ధాన్యానికి సంబంధించిన బోనస్‌ను రైతుల ఖాతాల్లో జమ చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని భరోసా ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు ముందస్తు అడ్వాన్స్‌లు ఇచ్చే అంశంపై జాగ్రత్తలు తీసుకోవాలని, రైతులు ఎలాంటి మోసాలకు గురికాకుండా చూడాలని తెలిపారు.రాబోయే సీజన్‌లో వరి సాగుకు నీరు, విద్యుత్ సరఫరా విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున రైతులకు ముందుగానే అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. భవిష్యత్తులో రైతులే స్వచ్ఛందంగా వరి సాగును తగ్గించే పరిస్థితులు రావచ్చని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు





తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్రంలో రెండు సంవత్సరాలకు సరిపడా ఆహార నిల్వలు ఉన్నాయని ముఖ్యమంత్రి, మంత్రివర్గం వెల్లడించిన విషయాన్ని ప్రస్తావించారు. అయితే తాగునీటి అవసరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని, ప్రతి ఒక్కరూ నీటిని అవసరాలకు అనుగుణంగా పొదుపుగా వినియోగించుకోవాలని, నీటి దుర్వినియోగాన్ని అరికట్టాలని పిలుపునిచ్చారు.ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉందని, ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయ విమర్శలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రజలను ఎలా ఆదుకోవాలనే దానిపై దృష్టి పెట్టాలని అన్నారు. ఈ నెల 28న అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి, తాగునీరు, విద్యుత్, వ్యవసాయ రంగాలకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామని తెలిపారు. అనంతరం అఖిలపక్ష ప్రతినిధులతో కలిసి ఢిల్లీకి వెళ్లి రాష్ట్రానికి అవసరమైన సహకారం కోరుతామని వెల్లడించారు. హుస్నాబాద్‌లోనూ అన్ని రాజకీయ పార్టీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అవసరమైన కార్యాచరణపై చర్చిస్తామని చెప్పారు. గ్రామ దేవతల ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ పట్టణంలోని సిద్దేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు, శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో లోక కళ్యాణం కోసం 18వ చండీయాగం నిర్వహించినట్లు,సీఎం రేవంత్ రెడ్డి నాగార్జునసాగర్‌లో పూజలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.రాష్ట్రంలో 300కు పైగా కరువు మండలాలు ఉన్నాయని, ప్రకృతి వైపరీత్యాలు ముందస్తు సమాచారం లేకుండానే సంభవించే అవకాశం ఉన్నందున వాటిని ఎదుర్కొనేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. 2007లో ప్రారంభమైన గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల నిర్మాణానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని, ప్రాజెక్టు కోసం భూములు కోల్పోతున్న రైతుల త్యాగాలను గుర్తిస్తామని, వారి సహకారంతోనే వేల ఎకరాల భూమి సాగులోకి వస్తుందని పేర్కొన్నారు. నియోజకవర్గానికి మొదటి దశలో 3,500, రెండో దశలో 2,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వంతో పాటు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీలు సమిష్టిగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

---

### శ్రీ మోహినికుంట మల్లికార్జున దేవాలయంలో

## విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం చేయొద్దు

**-సమీప ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌కు వినతి**

**వాస్తవం : చందుర్తి**

చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామంలోని శ్రీ మోనికుంట మల్లికార్జున స్వామి దేవాలయ ఆవరణలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం చేయొద్దని, సమీపంలోని ప్రభుత్వ భూమిలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించాలని కోరుతూ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. రైతుల సౌకర్యానికి నర్సింగాపూర్ లో విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరైనట్లు తెలిసిందని, శ్రీ మోహిని కుంట దేవాలయంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి సన్నాహాలు ఉన్నాయని, దాంతో భక్తులకు అసౌకర్యంగా ఉంటుందని, దేవాలయాభివృద్ధి చెందే అవకాశం ఉందని, విద్యుత్ సబ్ స్టేషన్ కు ప్రభుత్వ భూమిలో స్థలం కేటాయించి నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పెరుక గంగరాజు,



చింతకుంట సాగర్, పెరుక రంజిత్, బైరగోని వేణు, మెరుపుల వేణు, నీరటి చంద్ర శేఖర్, మెరుపుల అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## బాలికలకు వ్యాసరచన పోటీలు



**వాస్తవం : చందుర్తి**

పోలీస్ అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా చందుర్తి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల వసతి పాఠశాలల్లో సోమవారం వ్యాసరచన పోటీని నిర్వహించారు. సైబర్ మోసాలు , మాదకద్రవ్యాల దుష్ప్రభావాల గురించి విద్యార్థులకు వివరించారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినిలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కల్పన, చందుర్తి ఎఎస్ఐ సతీష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

**కొలనూరులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభినందన సభ**

**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**వాస్తవం : కోనరావుపేట**

రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందిస్తూ వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వెల్లడించారు. కోనరావుపేట మండలం కొలనూరు గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అభినందన సభలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజాసేవ చేసే నాయకులను గుర్తించి పదవులు కల్పించామని తెలిపారు. పదవులు పొందిన వారు రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రైతుల పాదాలకు ముల్లు గుచ్చుకుంటే దానిని పంటితో తీసినంత బాధ్యతతో ప్రజాప్రతినిధులు పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నామని, ప్రభుత్వం మాట సూచించిన విధంగా ఏడు రకాల సన్న వడ్లను సాగు చేసిన రైతులకు నేడు మంచి ప్రయోజనం చేకూరిందని పేర్కొన్నా రు. గతంలో వ్యవసాయం దండగ అనే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం రైతులు వ్యవసాయాన్ని పండుగలా చేసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. రూ. 2 లక్షలలోపు పంట రుణాలు తీసుకున్న 25 వేల కుటుంబాలకు రూ. 20, 600 కోట్ల మేర రుణమాఫీ చేసినట్లు వివరించారు. రైతులకు తిరిగి రుణాలు అందేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను నిలిపివేయకుండా కొనసాగిస్తున్నామని, పదేళ్లలో పంపిణీ చేయని రేషన్ కార్డులను తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అందించామని పేర్కొన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు అర్హులైన నిరుపేదలకు మరో 2,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాను సుమారు రూ. 1,000 కోట్లతో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. కోనరావుపేట మండలంలో సుమారు 1,500 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేశామని వివరించారు. గత పదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన పనులను తిరిగి ప్రారంభించి అభివృద్ధికి బాటలు వేస్తున్నామని పేర్కొన్నారు. మల్కపేట ప్రాజెక్టు ద్వారా మండలంలోని పది గ్రామాలకు సాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. రైతు విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు కృషి మండలంలో వ్యవసాయ అభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. జిల్లాలో 40 ఎకరాల్లో రైతు విజ్ఞాన కేంద్రానికి ఏర్పాటు జరుగుతుంది అని, అందుబాటులోకి వస్తే రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాగులో మెళకువలు, ఇతర సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. జడ్పీటీసీ స్థాయి నుంచి ఎదిగి ప్రజల ఆశీర్వాదంతో నేడు ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్‌గా ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందని తెలిపారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలపై రైతులకు అండగా నిలవాలని, కరోనా సమయంలో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయని గుర్తుచేస్తూ ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పుల కారణంగా ఏర్పడే పరిస్థితులను అర్థం చేసుకోవాలని ఆది శ్రీనివాస్ అన్నారు. కరువు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ఆరోపించడం సమంజసం కాదని, ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని ఎలా ఎదుర్కోవాలనే దానిపై దృష్టి సారించాలని సూచించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి, పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్య క్షులు కేతిరెడ్డి జగన్ మోహన్ రెడ్డి, కోనరావుపేట ఫ్యాక్స్ చైర్మన్ చేపూరి గంగాధర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు మానుక సత్యం, మార్కెట్ కమిటీ చైర్మెన్ కచ్చకాయల ఎల్లయ్య, వైస్ చైర్మన్ ప్రభాకర్, కొలనూరు ఫ్యాక్స్ చైర్మన్ బొమ్మన భాస్కర్ రావు, డైరెక్టర్లు, నీరటి సంజీవ్, మెర్గు బాలమ్మ, వీరబోయిన తిరుపతి, సుగూరి గణేష్, ఐదరి శ్రీనివాస్, గరుగుల మహిపాల్ రెడ్డి, జగిడి బాపురెడ్డి, సిద్రవేణి సరిత, సల్ల కార్తీక్, మొగిలి దేవయ్య, ఉప్పుల గంగయ్య, రాజిరెడ్డి , కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండ నర్సయ్య, ఫిరోజ్ పాషా, గొట్టె రుక్మిణి, సర్పంచులు, డైరెక్టర్లు నాయకులు , రైతులు పాల్గొన్నారు.








## సింగరేణి ఆర్జీ-1 నైపుణ్య శిక్షణ కేంద్రం ద్వారా

# 121 మందికి ఉద్యోగ అవకాశాలు




**వాస్తవం : గోదావరిఖని**

-సింగరేణి ప్రభావిత ప్రాంతాల నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ద్వారా ఉపాధి కల్పించాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పం సత్ఫలితాలనిస్తోంది. రామగుండం-1 ఏరియా నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం ద్వారా రెండవ విడతగా 121 మంది మహిళలు హైదరాబాద్ లోని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ తయారి కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారు ఈరోజు 4 బస్సుల్లో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. మరో 30 మంది త్వరలో నేరుగా హైదరాబాద్ లో ఉద్యోగాల్లో చేరనున్నారు యల్ యన్ అశోసియేట్ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం నిర్వహించి ఎలక్ట్రానిక్స్ అసెంబ్లింగ్ విభాగాలలో పని చేయుటకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా బస్సులలో వెళ్ళుచున్న అభ్యర్థులకు ఆర్జీ. 1 జియం శ్రీ లలిత్ కుమార్ మరియు సేవా అధ్యక్షురాలు శ్రీమతి అనిత లలిత్ కుమార్ అభ్యర్థులనుద్దేశించి అభినందనలు తెలిపారు. ఈ నైపుణ్య శిక్షణ కేంద్రం ద్వారా గత రెండేళ్లలో 600 మందికి పైగా ఉపాధి లభించిందని మార్కెట్ డిమాండ్ ఉన్న కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు ఎంపికైన అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో పనిచేసి వృత్తిలో ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యస్ ఓ టు జియం శ్రీ చంద్రశేఖర్ ఎల్ ఎన్ డైరెక్టర్ కౌశిక్ జీవీటీసీ మేనేజర్ మాధవరెడ్డి పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్ సంక్షేమాధికారి గణేష్ సెక్యూరిటీ అధికారి మురళి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## రెండో విడత దళిత బంధు

# యూనిట్లు మంజూరు చేయాలి



**వాస్తవం : సిరిసిల్ల**

రెండవ విడత దళిత బంధు యూనిట్లు మంజూరు చేయించాలని దళిత బంధు సాధన కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. మొన్నటి రోజు హుజురాబాద్, మధిరలో రెండో విడత దళిత బంధు ఇవ్వడం జరిగిందని, అలాగే మాకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిరణ్ కుమార్, దమ్మ భాస్కర్, నీరటి శ్రీనివాస్, బత్తుల కమలాకర్, సంటి బాబు రావు, బండి శ్రావణ్, పెంట బాబు, గుడిసె రమేష్, కట్కూరి స్వామి, ఎల్ హరీష్, బత్తుల రవిర బింగి స్వామి, మల్యాల మహేష్, జి దేవయ్య, న్యాత సురేష్, తదితరులు పాల్గొన్నారు.



# మల్లారెడ్డి యూనివర్శిటీ గుర్తింపు రద్దు చేయాలి

**యూనివర్సిటీ ఉంది చదువులకా లేక సినిమా ఈవెంట్లకా? సినిమా ప్రమోషన్ల కోసం విద్యార్థుల చదువులకు ఆటంకాలా? ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు పుట్ట లక్ష్మణ్**



**వాస్తవం : మేడిపల్లి :** మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలో ఉన్న మల్లారెడ్డి యూని వర్సిటీ, మల్లారెడ్డి విద్యాసంస్థల యాజ మాన్యం విద్యార్థుల చదువులతో ఆటలాడుతూ.. ఇటీవల యూనివర్సిటీలో విద్యార్థులకు చదువులకంటే ఎక్కువ సినిమా ఈవెంట్లను అర్థరాత్రి వరకు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తూ..చదువుల్లో రాణించాలని చెప్పకుండా సినిమాలు చూడాలని విద్యార్థులకు కళాశాలకు సెలవు ఇవ్వడం అంటే దేనికి సంకేతం ఇస్తు న్నారో తెలియజేయాలి. విద్యార్థుల తల్లితండ్రులు ఫీజులు కట్టేది సినిమా ఈవెంట్లలో పాల్గొనడానికా లేక సినిమాలు చూడటానికా అనే విషయం ఉన్నత విద్యాశాఖ , యూజీసీ అధికారులు చెప్పాలని ,మల్లారెడ్డి యూనివర్సిటీలో అక్టోబర్ 23 న జరిగిన "ఆదర్శ కుటుంబం" ట్రైలర్ లాంచ్ లో సినిమా అక్టోబర్ 30న విడుదల సందర్భంగా విద్యార్థులందరూ సినిమా వీక్షించాలని కోరుతూ యూనివర్సిటీ యాజమాన్యం వారు యూనివర్సిటీకి సెలవు ప్రకటించడం ఎంత వరకు సమంజసమని ,మల్లారెడ్డి యూనివర్సిటీలో విద్యాప్రమాణాలు మెరుగు పరచడం కంటే సినిమా ప్రమోషన్ల కోసం విద్యార్థులను సినిమా ఈవెంట్లకు బలిపెడుతున్నారని, మల్లారెడ్డి యూనివర్సిటీ విద్యాసంస్థ కాకుండా సినిమా ఈవెంట్ల హబ్ గా మార్చారని వెంటనే విద్యా శాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మల్లారెడ్డి యూనివర్సిటీలో జరుగుతున్న సినిమా ఈవెంట్లపై సినిమా చూడాలని ఇస్తున్న సెలవులపై స్పందించాలని మల్లారెడ్డి యూనివర్సిటీ గుర్తింపు రద్దు చేయాలని,తరచుగా సినిమా ఈవెంట్లు నిర్వహిస్తూ విద్యార్థుల చదువులకు ఆటంకాలు కలిగిస్తున్న మల్లారెడ్డి విద్యాసంస్థలపై ఉన్నత విద్యాశాఖ, యూజీసీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ,పుట్ట లక్ష్మణ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

## అందోల్ పాఠశాలలో 'సురక్షిత్ బచ్‌పన్ అభియాన్' లీగల్

**వాస్తవం : అందోల్**

పిల్లలపై జరుగుతున్న లైంగిక నేరాల నుంచి వారిని రక్షించేందుకు దేశవ్యాప్తంగా పాఠశాలల్లో చేపట్టిన "సురక్షిత్ బచ్‌పన్ అభియాన్" (చిన్నారులపై లైంగిక నేరాల నిరోధక చట్టం -ఫోక్సో అక్ట్, 2012) కార్యక్రమంలో భాగంగా అందోల్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రత్యేక లీగల్ అవగాహన సదస్సును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహమ్మద్ అసదుల్లా షరీఫ్ చైర్మన్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ - జూనియర్ సివిల్ జడ్జి హాజరై మాట్లాడుతూ... పోక్సోచట్టం - 2012 ప్రకారం పిల్లలపై జరిగే అఘాయిత్యాలు, వేధింపులు తీవ్రమైన శిక్షార్హమైన నేరాలని, బాధితులకు ఈ చట్టం ద్వారా పూర్తి రక్షణ లభిస్తుందని తెలిపారు. అలాగే అడ్వకేట్ హెచ్ ఎన్ వర్మ మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పోలీసులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో జోగిపేట ఏఎస్ఐ పాల్గొని, బాలల భద్రత, చట్టాలపై



విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపల్ దేవీదాస్ మాట్లాడుతూ... విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు, వారి మానసిక స్థైర్యానికి ఇటువంటి అవగాహన సదస్సులు ఎంతగానో దోహదపడతాయని, పాఠశాలలో విద్యార్థుల రక్షణకు తాము ఎప్పుడూ కట్టుబడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టీపిఎఫ్ ఆవిర్భావ కరపత్రాల ఆవిష్కరణ



**31న కొత్తగూడెంలో ప్రజా ఫ్రంట్ 17 ఆవిర్భావ సభను విజయవంతం చేయండి**

**వాస్తవం : వలిగొండ**

వలిగొండ మండల కేంద్రంలో కరపత్రాల ఆవిష్కరణ సందర్భంగా తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి కావలి యాదయ్య, మండల అధ్యక్షులు రాపోలు పవన్ కుమార్ మాట్లాడుతూ , తెలంగాణ ఉద్యమం చుట్టూ తిరిగి మళ్ళీ మొదటికి వచ్చిన పరిస్థితి నెలకొన్నది వీరోచిత త్యాగాలతో అన్ని వర్గాల ప్రజల పోరాటాలతో భౌగోళిక తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి 13 ఏళ్లు పూర్తి కాబోతున్నది. పాలకుల ప్రభుత్వాలు మారుతున్న అయినా కూడా సాధించుకున్న తెలంగాణపై మరలా కోస్తాంధ్ర పెట్టుబడిదారుల ఆధిపత్యమే నడుస్తున్నది. ప్రజాస్వామ్యం ప్రాథమిక లక్షణం ప్రజల ప్రజా సమస్యలను వారి ఆకాంక్షలను గుర్తించడం గౌరవించడం అలాగే ఆయా సమస్యల పరిష్కారం కోసం ఆశయాలు సాధించడానికి ఆకాంక్షలు సహకారం చేసుకోవడానికి ప్రజా ఉద్యమాలను ఆహ్వానించాలి. మన రాష్ట్రంలో దేశంలో ప్రజాస్వామ్యం ఇప్పటికే ఉందని ఎవరైనా అనుకుంటే ప్రజాస్వామ్య దేశంలో తెలంగాణ నినాదంఇవ్వడం ఎందుకు అభ్యంతరకరమో ఆలోచించమని ఒకవేళ దేశంలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదనుకుంటే ప్రజాస్వామిక తెలంగాణ కావాలని అడగడం ఒక బాధ్యతగా గుర్తించాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ మొదటి నుండి చెబుతూ వస్తున్నదన్నారు. ముఖ్యంగా తెలంగాణ విభజనపై దుర్మార్గంగా పలుమార్లు తన అక్కసు వెళ్ళగకుతున్నదన్నారు. స్వయంగా దేశ ప్రధాని మోదీ తెలంగాణ విభజన ఏ ఆరోగ్యకరమైన పద్ధతిలో జరగలేదని తెలంగాణ ప్రజల్ని అవమానిస్తూ మాట్లాడింది చూసాం అని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నుంచి రావలసిన నిధుల విషయంలో వివక్ష కొనసాగుతూనే ఉందన్నారు. తెలంగాణ నుంచి వసూలు అవుతున్న పన్నుల నుంచి ఈ రాష్ట్రానికి రావలసిన వాటాను కూడా కేంద్రం న్యాయంగా ఇవ్వడం లేదు. దేశవ్యాప్తంగా ఉన్నట్టే తెలంగాణలో కూడా యువత అత్యధికం వారి చదువుల్లో నాణ్యత చదువుకు తగిన ఉపాధిని కల్పించడం తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యతలో ఉండాలన్నా రు. రాష్ట్ర పునర్నిర్మాణం నాణ్యమైన నైపుణ్యంతో కూడిన విద్యా మీదనే ఆధారపడి ఉంటుంది కనుక ప్రాథమిక స్థాయి నుంచే న్యాయమైన విద్య బోధన జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలస్వామి, బాల కృష్ణ, బత్తిని రవి ,శ్రీశైలం పాల్గొన్నారు.

**ఎల్లమ్మ తల్లి ఆలయ షెడ్డు నిర్మాణానికి**

## రూ.5 లక్షలు మంజూరు



**వాస్తవం : ఎల్లారెడ్డిపేట:**

ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలోని ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద షెడ్డు నిర్మాణానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రూ.5 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో చేపట్టనున్న షెడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ బోనాల మణెమ్మ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రామచంద్రం, బుగ్గారెడ్డి, బోనాల సాయి కుమార్, నరేష్, పరశురాం, గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, వెంకటస్వామి, రంగయ్య, మల్లేశం, ఎల్లాగౌడ్, జవ్వాజి రాజు, పెద్ద మల్లేశం తదితరులు పాల్గొన్నారు. ఆలయ షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన బండి సంజయ్ కుమార్‌కు గౌడ సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

**కులాంతర వివాహ ప్రోత్సాహక**

## ఫిక్సిండ్ బాండ్‌లు అందజేత

**16 మందికి రూ. 2,50,000 చొప్పున బాండ్లను పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**

ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా మంజూరైన కులాంతర వివాహ ప్రోత్సాహక ఫిక్సిండ్ బాండ్లను రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అందజేశారు. జిల్లాలోని ఆయా మండలాలకు చెందిన 16 మంది కులాంతర వివాహం చేసుకోగా, ప్రభుత్వ ప్రోత్సాహక కోసం ఎస్సీ సంక్షేమ శాఖకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సీ సంక్షేమ శాఖ నుంచి ఒక్కో జంటకు మంజూరైన రూ. 2,50,000 విలువైన ఫిక్సిండ్ బాండ్లను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అందజేశారు. ఈకార్యక్రమంలో ఇంచార్జి జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి, తదితరులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

**యు సి డి కార్యకలాపాలపై**

## సమీక్షా సమావేశం

**వాస్తవం : రాజేంద్రనగర్**



యు సి డి కార్యకలాపాలపై జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీని వాస్ రెడ్డి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం జరిగింది. సోమ వారం రాజేంద్ర నగర్ జిహెచ్ఎంసి జోనల్ కార్యాలయంలో ఆయన డిపిఓలు, సీఈఓ లతో సమావేశమయ్యారు. ఇందు లో భాగంగా కొత్త స్వయం సహాయక సంఘాల ఏర్పాటు, బ్యాంకు లింకేజీ, మోడల్ మార్కెట్ల అభివృద్ధి, స్ట్రీట్ వెండింగ్ జోన్ల ఏర్పాటు వంటి అంశాలపై చర్చించారు. కొత్త స్వయం సహాయక సంఘాల ఏర్పాటు పై ప్రత్యేక దృష్టి సారించ చాలని అధికారులకు జోనల్ కమిషనర్ సూచించారు. స్ట్రీట్ వెండింగ్ జోన్ల వ్యాపారులు సులభంగా వారి వ్యాపారాలను నిర్వహించు కునేలా అవసరమైన సౌకర్యా లు కల్పించాలని అధి కారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో యు సి డి పి ఓ లు, సి ఓ లు, సిబ్బంది పాల్గొన్నారు.



# రాజకీయాల్లో మాదిగలకు తీవ్ర అన్యాయం

**ఐక్యతతో హక్కుల కోసం పోరాటం**

**మాదిగ మహాశక్తి కోర్ కమిటీ నేత శ్రీనివాస్**

**వాస్తవం : గోదావరిఖని**

రాజకీయ పార్టీల అభివృద్ధిలో మాదిగ జాతిని కీలకంగా వాడుకుంటూ రాజకీయంగా ఎదుగుదల విషయంలో మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర మాదిగ మహా శక్తి కోర్ కమిటీ సభ్యుడు ఆసంపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం పెద్దపెల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో రామగుండం నియోజకవర్గానికి చెందిన మాదిగ అడ్వకేట్స్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అసంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజకీయంగా మాదిగలను ఎదగకుండా అడ్డుపడుతున్న అంశాలపై ఇకపై తిరుగుబాటు తప్పదన్నారు. 'మన ఓట్లు మనకే' అనే నినాదంతో మాదిగ జాతి ఒక ప్రత్యేకమైన వ్యూహంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. అన్ని రాజకీయ పార్టీలు మాదిగ జాతిని అవసరానికి మాత్రం వాడుకుంటూ పాలనరంగంలో హోదాలను కల్పించే విషయంలో మాదిగ జాతి పై ఎప్పుడు వివక్షతనే చూపిస్తున్నారని శ్రీనివాస్ మండిపడ్డారు. భవిష్యత్తులో రాజకీయ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని మాదిగ అడ్వకేట్ వ్యూహాత్మకంగా పనిచేయాల్సిన అవసరం ఉందని దిశ నిర్దేశం చేశారు సామాజిక ఐక్యత రాజకీయ చైతన్యం... హక్కుల సాధన కోసం జాతికి చెందిన ప్రతి ఒక్కరు ఐక్యతతో ముందుకు సాగాలని ఆసంపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు హై కోర్ట్ అడ్వకేట్ పెద్దెల్లి ప్రకాష్ అధ్యక్షతన జరిగిన మాదిగ అడ్వకేట్ ప్రత్యేక ముఖాముఖి సమావేశంలో మాదిగ సీనియర్ లాయర్స్ గొర్రె రమేష్,పంగ శంకర్, ఇరుకిల్ల నర్సయ్య, ఆసం పల్లి రవీందర్ లంకా దాసరి రజిత శోభారాణి నాథరి అంజ య్య లింగస్వామి కాదశి శేఖర్, ఇరుగురాల సంతోష్, వర లక్ష్మి, కాంపెల్లి లక్ష్మీనారాయణ ఇరుగురాల జీవన్ కుమార్ ,మాట్ల బాను పొయిల సాగర్ గడ్డం సునీల్ కుమార్ బొల్లి శ్రీకాంత్ హేమప్రియ దర్శనులతో పాటు పలువురు మాదిగ న్యాయవాదులు మాదిగ సామాజిక వర్గానికి చెందిన ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.

**శ్రీ వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర**

# అందరికి ఆదర్శం

**రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**



**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**

ఆదికవి శ్రీ వాల్మీక మహర్షి జీవిత చరిత్ర అందరికి ఆదర్శమని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే వెల్లడించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం వాల్మీక మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహర్షికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ ఒక సామాన్య వ్యక్తిగా పుట్టి బోయవాణిగా జీవితం గడిపి, సప్తర్షుల బోధనలతో మహర్షిగా మారి ఆదికావ్యం రామాయణం అనే అమరగ్రంథాన్ని మనకు అందించిన మహనీయుడు వాల్మీకి మహర్షి ప్రతి ఒక్కరికి స్ఫూర్తి ప్రదాతని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్ఐకు మధుకర్,రమేష్, సిఐ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

# బాలల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**పాఠశాలల్లో బాలికలకు అవగాహన**

**వాస్తవం : సిరిసిల్ల**

బాలల రక్షణ, బాలలపై లైంగిక నేరాలను నిరోధించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి లక్ష్మణాచారి అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల రెసిడెన్షియల్ స్కూల్ లో సోమవారం తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ ఆదేశాలతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు పి నీరజ సూచనలతో బాలల హక్కులపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా "సురక్షిత్ బచ్పన్ అభియాన్" పేరుతో జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న పాఠశాల స్థాయి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పి లక్ష్మణా చారి మాట్లాడుతూ ... పిల్లలకు తమ హక్కుల గురించి, మంచి స్పర్శ--చెడు స్పర్శ గురించి, అపరిచితులు లేదా తెలిసిన వ్యక్తుల నుంచి ఎదురయ్యే ప్రమాదాల గురించి వయస్సుకు తగిన రీతిలో అవగాహన కల్పించడం ఎంతో అవసరమని తెలిపారు. పోక్సో చట్టంలోని నిబంధనలపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పాఠశాలలు విద్యాబోధనకు మాత్రమే పరిమితం కాకుండా, పిల్లల భద్రతకు కూడా అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వి సుష్మిత, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, న్యాయవాదులు పెంట శ్రీనివాస్, ఆడెపు వేణు, కళ్యాణి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.






# ఎల్ నినోపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**సాంస్కృతిక సారథి టీం లీడర్ పడిదం రాజేందర్**



**వాస్తవం : చెన్నారావుపేట**

జిల్లా కలెక్టర్ సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సోమవారం చెన్నారావుపేట మండల కేంద్రంలోని రాజీవ్ నగర్ కాలనీలో కళాజాత నిర్వహించారు. రానున్న రోజుల్లో ఎల్ నినో ప్రభావం విపరీతంగా పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నీటిని వృధా చేయకుండా ఇంకుడు గుంతలు తీసుకోవాలని ప్రతి నీటి చుక్క మానవ మనుగడకు అవసరమని అలాగే ఏసీలు కూలర్లు హీటర్ల వాడకం తగ్గించి కరెంటును పొదుపుగా వాడుకోవాలని పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి టీం లీడర్ పడిదం రాజేందర్ తాళ్ల సునీల్ నెల్లూట్ల సుమన్ యోచన గాదెపాక బాబు బరిగెల రవీందర్ కందగట్ల రామకృష్ణ తాళ్ల పెల్లి అశోక్ వాంకుడోత్ శ్రీలత గుగులోతు సాలమ్మ పాల్గొన్నారు.

**పెద్దపల్లి టౌన్ ఎస్సై రాజశేఖర్‌కు**

# జెఎస్ఎస్ యూనియన్ ఘన సన్మానం

**ప్రజలకు అందుబాటులో ఉంటూ**

**సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి**

**వాస్తవం : పెద్దపల్లి ప్రతినిధి**

పెద్దపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన గుమ్ముల రాజశేఖర్‌ను జర్నలిస్టు సంక్షేమ సంఘం (జెఎస్ఎస్) పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు వెన్నంపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెన్నంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై రాజశేఖర్ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని కోరారు. పోలీసులకు, జర్నలిస్టులకు మధ్య పరస్పర సహకారం, సమన్వయం ఉండటం సమాజానికి ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. ఎస్సై రాజశేఖర్ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జెఎస్ఎస్ గౌరవ అధ్యక్షుడు మంద భాస్కర్ యాదవ్, రాష్ట్ర ఈసీ సభ్యుడు కన్నూరి రాజు, వోడ్నాల లత, జిల్లా ప్రధాన కార్యదర్శి వోడ్నాల తిరుపతి, ఓమేష్, సంతోష్, ఎమ్మార్పీఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు కల్వల మల్లేష్, రాకేష్ పాల్గొన్నారు.






# సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## ఎమ్మెల్యే మందుల సామేలు

**వాస్తవం : అడ్డగూడూరు :**

ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని చౌళ్లరామారం గ్రామంలోని సా యి శ్రీనివాస్ పత్తి మిల్లులో సీసీఐ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో పత్తి దిగుబడి తక్కువగా వచ్చిందని, ఎకరానికి మూడు క్వింటాలు మాత్రమే దిగుబడి రావడంతో రైతులు చాలా నష్టపోయారని అన్నారు.సీసీఐ మద్దతు ధర రూ. 8,667 గా ఉండగా ప్రైవేట్ మార్కెట్లో రూ.9 వేలకు పైగా పలుకుతోందని, దీంతో రైతులు ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమేనన్నారు. రైతులకు గిట్టుబాటు ధర అందేలా పత్తి ధరను రూ.10 వేలకు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.రైతులు తమ పంటను తేమ లేకుండా ఆరబెట్టి కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. తూకం,నాణ్యత పరిశీలన, ధర నిర్ణయం, చెల్లింపులు పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆశించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన తోట మహేష్ ను ఎమ్మెల్యే అభినందించారు.ఈ కార్యక్రమంలో మోత్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నూనె ముంతల విమల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కొప్పుల నిరంజన్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు నిమ్మనగోటి జోజి, డీసీసీ కార్యదర్శి కడారి రమేష్, సర్పంచులు రాచకొండ రమేష్, చెడే అంబేద్కర్, కన్నెబోయిన లింగస్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బాలెంల విద్యాసాగర్, చిత్తలూరి సోమన్న, జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యుడు మందుల సోమన్న, ఇటికాల చిరంజీవి, పాశం సత్యనారాయణ, రవీందర్ రావు, గూడెపు పాండు, పూలపల్లి సోమిరెడ్డి, లక్ష్మయ్య, గంగరాజు, బాలెంల సైదులు, ననుబోతు సమ్మయ్య, చిత్తలూరు రవీందర్, బైరెడ్డి సందీప్ రెడ్డి, మారిశెట్టి మల్లేష్, కడారి నాగరాజు, రాజశేఖర్ రెడ్డి,తోట మహేష్, మందుల సోమన్న, వెంకటేష్, సిసిఐ అధి కారులు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, సిబ్బంది,రైతులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.





## నూతన ఎస్ఐకి సత్కారం



**వాస్తవం : చెన్నారావుపేట**

పోలీస్ స్టేషన్కు కొత్తగా బదిలీపై వచ్చిన సబ్ ఇన్స్పెక్టర్ గోవర్ధన్ని చెన్నారావుపేట మండల వయోవృద్ధుల సంక్షేమ సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు ఈగ సత్య నారాయణ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్కు చట్టబద్ధమైన రక్షణ కల్పించాలని వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి ములుక సాంబయ్య కవి, తన కవితా సంకలనా గ్రంథాన్ని బహుమతిగా ఇచ్చారు. కార్యవర్గ సభ్యులు వరంగంటి మల్లయ్య, కుమారస్వామి, తాలపెల్లి నర్సయ్య, కంది నారాయణరెడ్డి. గట్ల కృష్ణ, ముత్యం సాంబయ్య. బిక్షపతి, మొదలగువారు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరులకు నివాళులు



**వాస్తవం : చెన్నూర్ ఆర్సీ**

పోలీస్ అమరవీరుల త్యాగలను స్మరించుకుంటూ సోమవారం చెన్నూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్లో చెన్నూర్ పట్టణ పోలీస్లు,పోలీస్ కళాబృందం వారి ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను పాటల రూపంలో పోలీస్ కళాబృందం గుర్తు చేశారు. 1959 సంవత్సరం అక్టోబర్ 21 న చైనా వారి దుష్చర్యలో భాగంగా లడక్లో ప్రాణాలు అర్పించిన సీఆర్పీఎఫ్ జవానుల స్మారకర్థం పోలీస్ అమరవీరుల వారోత్సవాలు జరుపుతూ అదేవిదంగా విధి నిర్వహణలో తమ ప్రాణాలను త్యాగం చేసిన ఎంతోమంది పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు.

## అంగరంగ వైభవంగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

**వైభవంగా రథోత్సవం**

**వాస్తవం : సిరిసిల్ల**

సిరిసిల్ల పట్టణంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాల కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు, కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి రథోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. సిరిసిల్ల పట్టణంతోపాటు సమీప గ్రామాల నుండి తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. రథోత్సవం కార్యక్రమాన్ని భక్తుల తిలకించి పుణ్య ప్రాప్తులయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్,బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక బ్రహ్మోత్సవాల్లో పాల్గొని మొక్కులు సమర్పించారు. శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో కళ్యాణం, రథోత్సవం కార్యక్రమాలను ఆలయ ముఖ్య కార్యాచరణ అధికారి మారుతీ రావు



ఆధ్వర్యంలో ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో సంప్రదాయంగా శాస్త్రక్తంగా ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు మున్సిపల్ పాలన వర్గం ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బందితో సేవలందించారు. బ్రహ్మోత్సవాల్లో భారీ సంఖ్యలో భక్తులు తరలించడంతో రద్దీనులకుంది. కార్యక్రమాలకు పోలీసులు ప్రత్యేక ఏర్పాటు చేశారు.

## అనాలోచిత నిర్ణయాలతో.. ఉన్న రైలు ఆగం

**దక్షిణ తెలంగాణ ప్రజలకు తీవ్ర అన్యాయం : ఎస్. వెంకటేష్**

**వాస్తవం : రాజేంద్రనగర్**

కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో మెట్రో ప్రాజెక్టు ఆగమయ్యిందని కాటేదాన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ... అంతర్జాతీయ విమానాశ్రయంగా పేరుగాంచిన శంషాబాద్ కు గత బిఆర్ఎస్ ప్రభుత్వం మెట్రో ప్రాజెక్టును మంజూరు చేసిందని గుర్తు చేశారు. ప్రధానంగా రాయదుర్గం నుండి ఎయిర్పోర్ట్ వరకు 31 కిలోమీటర్ల ఎయిర్పోర్ట్ ఎక్స్ప్రెస్ మెట్రో కారిడార్ ప్లాన్ చేయబడిందని తెలిపారు. ఈ మార్గంలో బయోడైవర్సిటీ జంక్షన్, నానక్ రామ్ గూడ, నార్సింగ్, టీఎస్ పోలీస్ అకాడమీ, రాజేంద్రనగర్, శంషాబాద్ టౌన్, ఎయిర్పోర్ట్ కార్గో, టెర్మినల్ తదితర స్టేషన్లు ప్రాజెక్టు నివేదికలో ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాయదుర్గం నుంచి 25 నుండి 30 నిమిషాల్లో చేరుకోవచ్చని చెప్పారు. ఇందుకోసం 2022లో 6, 250 కోట్ల పనులకు బిఆర్ఎస్ ప్రభుత్వం శంకుస్థాపన చేసిందని పేర్కొన్నారు. 2023 డిసెంబర్ తర్వాత సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఓ ఆర్ ఆర్ వెంట వెళ్లే ప్రతిపాదిత మార్గం టెండర్లను నిలిపివేసిందని సూచించారు. బదులుగా పాతబస్తీ నుండి విమానాశ్రయానికి వెళ్లే మెట్రో ను విస్తరించే ప్రత్యామ్నాయాలను పరిశీలించాలని అధికారులకు ఆదేశాలు అందాయన్నారు. ప్రస్తుతం మెట్రో పనులు



ప్రారంభం కాకపోగా ఎం ఎం టి ఎస్ రైలును ఉందానగర్ నుంచి విమానాశ్రయం వరకు ప్రోడిగించే ప్రతి పాదన కూడా అటకెక్కిందని ఆరోపించారు. తద్వారా దక్షిణ తెలంగాణ ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఓట్ల అక్రమ తొలగింపుపై కాంగ్రెస్ పోరు

### హనుమకొండలో 'ఓట్ బచావో - దేశ్ బచావో' మూడవ దశ సమావేశం

**వాస్తవం : వరంగల్ జిల్లా ప్రతినిధి**

కేంద్ర ప్రభుత్వం ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడుతోందని ఏఐసీసీ పరిశీలకులు కేబీఆర్ నాయుడు, హనుమకొండ డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తీవ్రంగా నిరసించారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'ఓట్ బచావో – దేశ్ బచావో' ఉద్యమ మూడవ దశ కార్యాచరణలో భాగంగా ఆదివారం హనుమకొండ డిసిసి భవన్ లో జిల్లా స్థాయి సమన్వయ, మీడియా సమావేశం జరిగింది. డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఏఐసీసీ అబ్జర్వర్ కేబీఆర్ నాయుడు, టీపీసీసీ కోఆర్డినేటర్ అరికెల నర్సా రెడ్డి ముఖ్య అతిథులుగా





హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్రంలోని అధికార పక్షం తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఎన్నికల సంఘాన్ని ఆధీనంలోకి తెచ్చుకుని అక్రమంగా ఓట్లు తొలగిస్తోందని ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించే వరకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దేశ ప్రజల కోసం రాహుల్ గాంధీ నిరంతరం పోరాడుతున్నారని, రాబోయే ప్రధాని రాహుల్ గాంధీయే అని ధీమా వ్యక్తం చేశారు. మూడవ దశలో భాగంగా జిల్లాలోని ప్రతి బ్లాక్, బూత్, గ్రామ స్థాయికి ఉద్యమాన్ని తీసుకెళ్తామని, బూత్ ఏజెంట్లకు 'ఓట్ రక్షక్ పోర్టల్' పై శిక్షణ ఇచ్చి, ప్రతి గ్రామంలో 'గ్రామ చౌపాల్' రచ్చబండ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. నవంబర్ 1న ఢిల్లీ రామ్ లీలా మైదాన్ ర్యాలీకి, నవంబర్ 25, 26 'ఢిల్లీ చలో' కార్యక్రమానికి జిల్లా నుండి మద్దతు తెలుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కె.ఆర్. నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, టిపిసిసి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కుడా చైర్మన్ గుండు సుధా రాణి తదితరులు పాల్గొన్నారు.

---

### ఎల్లమ్మ తల్లి ఆలయ షెడ్డు నిర్మాణానికి

## రూ.5 లక్షలు మంజూరు



**వాస్తవం : ఎల్లారెడ్డిపేట :**

ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలోని ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద షెడ్డు నిర్మాణానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రూ.5 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో చేపట్టనున్న షెడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ బోనాల మణెమ్మ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రామచంద్రం, బుగ్గారెడ్డి, బోనాల సాయి కుమార్, నరేష్, పరశురాం, గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, వెంకటస్వామి, రంగయ్య, మల్లేశం, ఎల్లాగౌడ్, జవ్వాజి రాజు, పెద్ద మల్లేశం పాల్గొన్నారు.

## రామగిరి ఖిల్లాకు రోప్‌వే మంజూరు చేయించిన ఎంపీ వంశీకృష్ణ

**రామగిరి ఖిల్లాకు ప్రపంచస్థాయి గుర్తింపు**

**ట్రెక్కింగ్ చేసిన యువతకు వన్‌ప్లస్ ఫోన్ గెలుచుకునే అవకాశం**

**వాస్తవం : రామగిరి:**



చారిత్రక రామగిరి ఖిల్లాకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. రామగిరి ఖిల్లా అభివృద్ధి,పర్యాటక రంగం విస్తరణకు కృషి చేస్తున్న ఎంపీ సోమవారం రామగిరి ప్రాంతంలో సుమారు 10 కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించి,ఖిల్లా పూర్తి ప్రాంతాన్ని సందర్శించారు. ఏడు గేట్లు దాటి,రెండు సరస్సులను అధిగమించి, నాలు గుట్టలను అధిరోహిస్తూ అత్యంత సాహసోపేతంగా ఖిల్లా పైభాగానికి చేరుకున్న ఎంపీ వంశీకృష్ణ అక్కడి శివాలయం, శ్రీరామచంద్ర స్వామి ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.రామగిరి ఖిల్లాలోని చారిత్రక కట్టడాలు,పురాతన ఆలయాలు,ప్రకృతి అందాలను స్వయంగా పరిశీలించారు.అనంతరం ఎంపీ మాట్లాడుతూ కేంద్రం మంజూరు చేసిన రూ.12 కోట్లలో రూ.7.5 కోట్లు రామగిరి ఖిల్లా పర్యాటక అభివృద్ధికి కేటాయించిందని,2.1 కిలోమీటర్ల రోప్‌వే నిర్మాణానికి అనుమతులు ఇచ్చిందని వెల్లడించారు.అంతేకాకుండా రామగిరి ఖిల్లా వద్ద పర్యాటకులకు మౌలిక వసతులు కల్పించేందుకు రూ.2.5 కోట్ల నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. రోప్‌వే అందుబాటులోకి వస్తే పర్యాటకులు ఖిల్లాను సందర్శించడం మరింత సులభతరం కానుంది.ముఖ్యంగా వృద్ధులు, మహిళలు,పిల్లలు సైతం చారిత్రక ఖిల్లాను సులభంగా సందర్శించే అవకాశం కలుగుతుంది.దీంతో మంథని ప్రాంతానికి పర్యాటక రంగంలో ప్రత్యేక గుర్తింపు లభించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది.ట్రెక్కింగ్‌లో పాల్గొన్న వారిలో ఎంపికైన విజేతకు వన్‌ప్లస్ ఫోన్ బహుమతిగా అందజేస్తామని ప్రకటించారు.

## ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలి

**మండల వ్యవసాయ అధికారి గోపాల్‌రెడ్డి**



**వాస్తవం : చెన్నారావుపేట**

చెన్నారావుపేట మండలంలోని అమీనాబాద్ గ్రామంలో ఖేత్ బచావో అభియాన్‌లో భాగంగా రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. రాబోయే యాసంగి సీజన్‌లో పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎల్‌నినో ప్రభావం, జీరో టిల్లేజ్ వరి సాగు ప్రాముఖ్యత, పంట అవశేషాలను కలియదున్నడం, విద్యుత్ ఆదా వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని, వాటికి అనుగుణంగా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దార రజిత, ఉపసర్పంచ్ బండి హరీష్, మండల వ్యవసాయ అధికారి గోపాల్‌రెడ్డి, హార్టికల్చర్ అధికారి తరుణ్, వెటర్నరీ వైద్యుడు వెంకటరాజు, పీఏసీఎస్ చైర్మన్ ఎం. వెంకటరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ఎస్. రమేష్, ఆర్ఐ మమత, పంచాయతీ కార్యదర్శి బి. సుమలత, వ్యవసాయ విస్తరణ అధికారి కిరణ్మయి, జీపీఓ రాజు, గ్రామ రైతులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలు కావాలి

**వాస్తవం : రాజేంద్రనగర్**

ఆచరణాత్మక పరిష్కారాలతోటే ప్రజా సమస్యలకు విముక్తి లభిస్తుందని మణికొండ బిఆర్ఎస్ పార్టీ నాయకులు అన్నారు. షేక్‌పేట్ నాలా, సీబీఐటీ కారిడార్, మణికొండ పైప్‌లైన్ రోడ్డు విస్తరణ పనులు పర్యావరణ హితంగా, ప్రజలకు ఉపయోగపడేలా జరగాలని వారు డిమాండ్ చేశారు. ఇదే విషయమై సోమవారం హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఉపేందర్ రెడ్డి ని బిఆర్ఎస్ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ...పరిసర ప్రాంతాల్లో కొత్తగా నిర్మితమవుతున్న హైరైజ్ భవనాల్లోకి సుమారు 2 లక్షల మంది అదనపు నివాసితులు రానున్నట్లు తెలిపారు. దీంతో పెరిగే ట్రాఫిక్ భారం, అలాగే ముష్కిన్ చెరువు పరిరక్షణపై ఆందోళనలు వ్యక్తం చేశారు. కొంతమంది నాయకులు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ఎమ్మెల్యేను కలిసి ఫోటోలు దిగడం ప్రజాసేవకు కొలమానం కాదని అన్నారు. చెరువు సరిహద్దు విషయమై చట్టబద్ధమైన బఫర్ జోన్ కు భంగం కలగకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణానికి నష్టం వాటిల్లకుండా ప్రజల జీవన శైలి పై ప్రభావం పడకుండా ఆచరణ సాధ్యమైన పరిష్కారాలను అందించాలని అధికారులను వారు డిమాండ్ చేశారు.

# తుమ్మిడిహెట్టిపై పునఃపరిశీలన!

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో చర్చించారు.

**గతంలోనూ సానుకూల వైఖరి: ఫడ్నవీస్**

తుమ్మిడిహెట్టి బరాజ్ విషయంలో గతంలోనూ మహారాష్ట్ర సానుకూల వైఖరి అనుసరించిందని ఫడ్నవీస్ గుర్తుచేశారు. బరాజ్ నిర్మాణ స్థలం, వివిధ ఎత్తుల వద్ద ముంపు ప్రభావం, అవసరమైన భూమి విస్తీర్ణాన్ని తమ స్వతంత్ర అధ్యయనంలో పరిశీలిస్తామని, ఈ అధ్యయనంలో వెల్లడయ్యే అంశాలు, అంచనాలపై తెలంగాణకు అభ్యంతరాలు ఉంటే రెండు రాష్ట్రాల అధికారులు వాటిపై చర్చిస్తారని ఫడ్నవీస్ తెలిపారు. అవసరమైతే నిపుణుల అభిప్రాయాలను కూడా తీసుకుంటామన్నారు. గతంలో ఇచ్చిన అనుమతుల అనంతరం ప్రాజెక్టు వల్ల ఏర్పడే వాస్తవ ముంపు ప్రాంతం తొలుత అంచనా వేసిన దానికంటే పెరిగినట్లు గుర్తించామని తెలిపారు. ఈ నేపథ్యంలో వాస్తవాలు, సాంకేతిక అంశాల ఆధారంగా తదుపరి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. తెలంగాణ నీటి అవసరాల విషయంలో సహకరించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే మహారాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకే ప్రాధాన్యం అని ఫడ్నవీస్ తెలిపారు. తుమ్మిడిహెట్టి విషయంలో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) కూడా అవసరమైన అధ్యయనాలు, సాంకేతిక పరిశీలనలు చేపడుతుందని చెప్పారు. ఆలోగా రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. బరాజ్ ఎత్తు, నీటి లభ్యతపై ఈ కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలను పరిశీలించాలన్నారు. ప్రాజెక్టు స్థలంలో మార్పులతో ముంపు ప్రాంతంపై పడే ప్రభావం, సంబంధిత అభయారణ్యం పరిధిలోకి వచ్చే ప్రాంతాలు, నదీ పరివాహక ప్రాంతం వెలుపల అవసరమయ్యే భూముల వివరాలను పరిశీలిస్తామని వెల్లడించారు. పరిహారం, ఇతర సాంకేతిక అంశాలనూ అధ్యయనం చేయాలని చెప్పారు. అవసరమైతే ప్రత్యామ్నాయాలను కూడా అధ్యయనం చేయాలని, రెండు రాష్ట్రాల అధికారులు, సాంకేతిక నిపుణులు సంప్రదింపులు జరపాలని సూచించారు. తదుపరి సమావేశాల నిర్వహణ, కాలపరిమితులను నిర్ణయించాలన్నారు.



**మా అమ్మమ్మ తెలుగు మాట్లాడతారు..**

ప్రాజెక్టుపై ముందుకు వెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని మహారాష్ట్ర సీఎం చెప్పారు. స్నేహ భావం, సోదర భావంతో మంచి పొరుగు రాష్ట్రాలుగా ముందుకు వెళ్లాలని అభిప్రాయపడ్డారు. తెలంగాణతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. సరిహద్దులోని ఆదిలాబాద్ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని చెప్పారు.

**రెండు రాష్ట్రాలను కలిపే వారధి: సీఎం రేవంత్**

దేశ రక్షణ, వ్యూహాత్మక రంగాల విషయంలో ఆదిలాబాద్ ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యతను సీఎం రేవంత్ ప్రస్తావించారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత



రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయం అందుబాటులోకి వస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ఊతమిస్తుందని తెలిపారు. మహారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాలకూ ప్రయోజనం కలుగుతుందని వివరించారు. విమానాశ్రయంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో రవాణా సదుపాయాలతో పాటు ఆర్థిక కార్యకలాపాలు, అభివృద్ధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. తుమ్మిడిహెట్టి కేవలం సాగునీటి ప్రాజెక్టుగానే కాకుండా, రెండు రాష్ట్రాలను భౌతికంగా అనుసంధానించే వారధిగా నిలుస్తుందని చెప్పారు. తెలంగాణ--మహారాష్ట్ర మధ్య చారిత్రక, సాంస్కృతిక సంబంధాలున్నాయంటూ పూర్వ హైదరాబాద్ సంస్థానంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలకు ఉన్న చారిత్రక అనుబంధాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధానంగా వెనుకబడిన అటవీ ప్రాంతమని చెబుతూ అక్కడి గిరిజనులు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఫడ్నవీస్ దృష్టికి తీసుకెళ్లారు. వారి జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందన్నారు. ఇలావుండగా..హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు మహారాష్ట్ర సీఎంను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. ఈ సదస్సుకు హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు.

**152 మీటర్ల ఎత్తుతోనే అత్యంత ప్రయోజనం: మంత్రి ఉత్తమ్**

తుమ్మిడిహెట్టి బరాజ్‌ను 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడమే అత్యంత ప్రయోజనకరమైన ప్రత్యామ్నాయమని మంత్రి ఉత్తమ్ తన ప్రజెంటేషన్‌లో వివరించారు. 2016లో 148 మీటర్ల ఎత్తుతో బరాజ్ నిర్మాణానికి ఒప్పందం జరిగినా, దానితో తెలంగాణ తాగు, సాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని చెప్పారు. బరాజ్‌తో మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ప్రస్తుత విద్యుత్ అవసరాలు, ఇంధన వ్యయం, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులను పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

# అది తప్పుడు వార్తే

**అంగీకరించిన ఈనాడు పత్రిక**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు క్షమాపణ**

**కేటీఆర్ పంపిన లీగల్ నోటీసులకు తలవంచిన ఈనాడు యాజమాన్యం**

**కేటీఆర్ పాస్‌పోర్టుపై తప్పుడు వార్త ప్రచురించామని పశ్చాత్తాపం**

**సంబంధిత కథనాలను అన్ని వేదికల నుంచి తొలగించినట్టు స్పష్టీకరణ**

**కేటీఆర్ న్యాయవాది పంపించిన నోటీసుకు సంస్థ సమాధానం**

**వ్యవహారాన్ని ముగించాలని విన్నపం**



**హైదరాబాద్, అక్టోబర్ 26 :** తప్పుడు వార్తను ప్రచురించినందుకు చరిత్రలో మొదటిసారిగా ఈనాడు పత్రిక యాజమాన్యం క్షమాపణలు చెప్పింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పంపిన లీగల్ నోటీసులతో దెబ్బకు దిగొచ్చింది. 'కేటీఆర్ పాస్‌పోర్టు సీజ్' అనే శీర్షికతో ఈనాడులో ఇటీవల ప్రచురించిన కథనం తప్పుడు వార్తేనని అంగీకరించింది. ఇందుకు పశ్చాత్తాపం ప్రకటించింది. క్షమాపణలు కోరింది. ఈ వార్తను తమ సంస్థలకు చెందిన అన్ని రకాల డిజిటల్ మాధ్యమాల నుంచి తొలగించినట్టు వెల్లడించింది. ఈ మేరకు తన న్యాయవాది ద్వారా వివరణ ఇచ్చింది. కేటీఆర్ పాస్‌పోర్టును సీజ్ చేయాలని ఏసీబీ కోర్టు ఆదేశాలు ఇవ్వకపోయినప్పటికీ, ఇచ్చినట్టుగా ఈనాడు దినపత్రిక ఇటీవల తప్పుడు కథనం ప్రచురించింది. దీనిపై కేటీఆర్ లీగల్ నోటీసులు పంపించారు. దీంతో దిగొచ్చిన ఈనా డు యాజమాన్యం.. కేటీఆర్ పాస్‌పోర్టు వ్యవహారంలో తమ పత్రికలో తప్పుడు వార్తను ప్రచురించినట్టు అంగీకరించింది. ఇది ఉద్దేశపూర్వకంగా చేయలేదని, పొరపాటున తప్పు జరిగిందంటూ పశ్చాత్తాపం వ్యక్తంచేసింది. తప్పుడు వార్త ప్రచురించినందుకు క్షమాపణలు కోరింది. ఇక ఈ వ్యవహారాన్ని ముగించాలని కేటీఆర్ తరపు న్యాయవాదిని కోరింది. కేటీఆర్ పాస్‌పోర్టుల విషయంలో తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఏసీబీ ప్రత్యేక కోర్టులో దాఖలు చేసిన మెమోను తప్పుగా అర్థం చేసుకొని, కేటీఆర్ పాస్‌పోర్టును తాతాలికంగా జప్తు చేయాలని కోర్టు ఆదేశించినట్టుగా వార్త ప్రచురించడం పొరపాటేనని అంగీకరించింది. ఈ వ్యవహారంపై కేటీఆర్ తరపు న్యాయవాది ఎన్ లలితారెడ్డి సెప్టెంబర్ 30న పంపిన లీగల్ నోటీసుకు.. ఈనాడు సంస్థ తరఫు న్యాయవాది జీవీఎస్ జగన్నాథరావు అక్టోబర్ 13న సమాధానం ఇచ్చారు. సెప్టెంబర్ 29న ఈనాడు హైదరాబాద్ ఎడిషన్‌లో ప్రచురితమైన వార్తలో ఏసీబీ దాఖలు చేసిన మెమోలోని అంశాలను తప్పుగా పేర్కొన్నట్టు ఆ సమాధానంలో వివరించారు. పాస్‌పోర్టులను తాతాలికంగా జప్తు చేయాలని ఆదేశాలు ఇచ్చినట్టుగా వార్తలో రాయడం పొరపాటని సంస్థ తరపున అంగీకారం తెలిపారు.

పాస్‌పోర్టుల విషయంలో తగిన ఆదేశాలు జారీ చేయాలని ఏసీబీ కోరిందని, ఈ మేరకు దాఖలు చేసిన మెమోలోని అంశాన్ని తప్పుగా అర్థం చేసుకోవడం వల్లే వార్తలో పొరపాటు చోటుచేసుకున్నదని వివరణ ఇచ్చారు. వాస్తవానికి పాస్‌పోర్ట్ స్వాధీనం కోసం ఏసీబీ దాఖలు చేసిన మెమో ఆధారంగా కోర్టు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదు. ఈనాడు ప్రచురించిన వార్తలో జరిగిన పొరపాటు ఉద్దేశపూర్వకమైనది కాదని, అది నిజమైన పొరపాటేనని, ఇందుకు తీవ్రంగా విచారం వ్యక్తంచేస్తున్నామని ఈనాడు తరఫు న్యాయవాది తెలిపారు. ఈ విషయంపై అక్టోబర్ 7న ఈనాడు ఎడిషన్‌లో వివరణ ప్రచురించి, పొరపాటును సరిదిద్దామని పేర్కొన్నారు. కేటీఆర్ తరపున న్యాయవాది లలితారెడ్డి పంపిన నోటీసులో చేసిన డిమాండ్‌ను కూడా నెరవేర్చామని తెలిపారు. ఆ నోటీసు అందిన వెంటనే ఈనాడు డిజిటల్, సోషల్ మీడియా ఖాతాల్లో ప్రచురితమైన సంబంధిత కథనాలన్నింటినీ తొలగించామని వెల్లడించారు. వార్తలో జరిగిన తప్పును సరిదిద్దుతూ అక్టోబర్ 7న ఈనాడు వివరణ ప్రచురించిందని న్యాయవాది తన సమాధానంలో పేర్కొన్నారు. ఈ పొరపాటు ఉద్దేశపూర్వకంగా జరిగినది కాదని, అనుకోకుండా జరిగిందని, ఇందుకు తీవ్ర విచారం వ్యక్తంచేస్తున్నామని వివరించారు. పొరపాటు జరిగిందని వివరణ ప్రచురించడం, సంబంధిత డిజిటల్ కథనాలను తొలగించడం వంటి చర్యలను ప్రస్తావిస్తూ, ఈ అంశంపై తదుపరి చర్యలు తీసుకోకుండా చూడాలని ఈనాడు సంస్థ తరఫు న్యాయవాది కోరారు.

## స్కూల్ ఫీజుల ప్రొసీడింగ్‌పై అధికారులను ప్రశ్నించిన

# జేఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు వెన్నంపల్లి శ్రీనివాస్

**ఎమ్మెల్యే విజయరమణారావు జోక్యం..**

**ప్రొసీడింగ్ జారీ చేయాలని అధికారులకు ఆదేశం**

**వాస్తవం : పెద్దపల్లి ప్రతినిధి**

జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు రాయితీకి సంబంధించిన ప్రొసీడింగ్ జారీ అంశంపై జర్నలిస్టు సంక్షేమ సంఘం (జేఎస్ఎస్) పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు వెన్నంపల్లి శ్రీనివాస్ అధికారులను ప్రశ్నించారు. పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమక్షంలో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించి, ప్రొసీడింగ్ జారీపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా స్పందించిన ఎమ్మెల్యే విజయరమణారావు, సంబంధిత అంశంపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీకి సంబంధించిన ప్రొసీడింగ్ జారీ చేయాలని ఆదేశించినట్లు సమాచారం. జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించే అంశాన్ని జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధి సమక్షంలో జేఎస్ ఎస్ జిల్లా అధ్యక్షుడు నేరుగా ప్రస్తావించడంతో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే స్పందనతో ప్రొసీడింగ్ జారీపై జర్నలిస్టుల్లో ఆశలు నెల కొన్నాయి.



# కరువు తెచ్చి..వరి వద్దంటరా?

**గోదావరిలో నీళ్లున్నా ఎత్తిపోయరు**

**కృష్ణకు వదిలి కరువు అంటున్నరు**

**రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది**

**ఈ ప్రభుత్వం ఏ వర్గానికీ న్యాయం చేయలే**

**ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పోరాటానికి మద్దతు**

**ఏడాది ఓపిక పడితే.. మళ్లీ వచ్చేది కేసీఆరే**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 26 :** గోదావరిలో నీళ్లున్నా ఎత్తిపోయకుండా రాష్ట్రంపైకి కరువును తెచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు వరి వేయవద్దంటూ రైతులకు సుద్దులు చెప్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ఇవాళ రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏ ఒక్క వర్గానికీ న్యాయం చేయలేదని, అన్ని వర్గాలనూ మోసం చేసిందని దుయ్యబట్టారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి అండగా ఉంటామని, కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం అసెంబ్లీలో నిలదీస్తామని భరోసా ఇచ్చారు. సిరిసిల్ల జిల్లాలో కేటీఆర్ సోమవారం పర్యటించారు. మొదట గంభీరావుపేట మండలం లింగన్నపేటలో శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు. తర్వాత సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్‌లో అంబాభవానీ మండపంలో పూజలు చేశారు. అనంతరం సిరిసిల్లలోని జిల్లా ప్రభుత్వ దవాఖానలో రూ.30 లక్షల విలువైన అత్యవసర వైద్య సేవల పరికరాలను ప్రారంభించారు. అనంతరం తెలంగాణ భవన్‌లో కుమ్రం భీం వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్‌ను ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు కలిశారు. తాము






14 రోజులుగా నిరసనలు చేస్తున్నా ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించడం లేదని గోడు వెళ్లబోసుకున్నారు. ఉద్యోగుల పోరాటానికి అండగా ఉంటామని కేటీఆర్ భరోసా ఇచ్చారు. ఇది మూర్ఖపు ప్రభుత్వమని, మీకిచ్చిన హామీలు అమలు చేస్తాడని నమ్మకం లేదన్నారు. మరో ఏడాదిన్నర ఓపిక పడితే మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని, అప్పటి వరకు ఓపిక పట్టాలని కోరారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి మోసం చేసిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఉద్యోగులకు ఆరు నెలల్లో పీఆర్సీ ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదని, మూడేండ్లలో ఏడు డీఏలు బాకీ ఉన్నాడని మండిపడ్డారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా పీఆర్సీలు అందించారని గుర్తుచేశారు. ప్రస్తుతం గోదావరిలో నీళ్లున్నా ఎత్తిపోయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కిందికి కృష్ణకు గోదావరి నీళ్లు వదిలిపెట్టి ఇప్పుడు కరువు అంటూ కథలు చెప్తున్నాడని విమర్శించారు. కాళేశ్వరాన్ని కేసీఆర్ కట్టిందే నీళ్ల కోసమని, దానిని మూడేండ్లుగా బదనాం చేసి నీళ్లు ఎత్తిపోయడం లేదని అన్నారు. రాబోయే ప్రభుత్వం అన్ని వర్గాలకు, ఉద్యోగులకు కావాల్సిన అవసరాలను అడగకుండా తెలుసుకొని అమలు చేస్తుందని చెప్పారు. ఒక్క సంవత్సరం ఓపిక పట్టాలని, ప్రజలకు మంచి రోజులు వస్తాయని ధీమా వ్యక్తంచేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో కరువు ఉన్నదని ముఖ్యమంత్రే చెప్తున్నారని, మళ్లీ మూసీ సుందరీకరణ అంటూ సోకులు పడడానికి వేల కోట్ల రూపాయలకు టెండర్లు పిలుస్తున్నాడని కేటీఆర్ మండిపడ్డారు. గతంలో రోమ్ నగరం తగలబడుతుంటే చక్రవర్తి ఫిడేల్ వాయించిన చందంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరు ఉందని ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వానికి పేదలు, చిరుద్యోగులు, వాళ్లకు ఇచ్చిన హామీలపై పట్టింపు, సోయి లేదని అన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు కేటీఆర్ చొరవతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల ద్వారా దాదాపు రూ.30 లక్షల విలువైన వైద్య పరికరాలు సమకూర్చగా.. సోమవారం వాటిని ఆయన ప్రారంభించి అందుబాటులోకి తీసుకొచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన ఎగదండి మేఘనకు మెరుగైన వైద్యం కోసం అయ్యే ఖర్చులు భరిస్తానని హామీ ఇచ్చారు. పేగు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మేఘన ఆహారం కూడా తీసుకోలేని స్థితికి చేరింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన గుగులోత్ జశ్వంత్‌కు కేటీఆర్ గిఫ్ట్ ఏ స్మైల్ ద్వారా ల్యాప్‌టాప్‌ను అందజేశారు.